క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



అబిడ్స్: పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అర్హులందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా ధూల్‌పేట్‌లోని తన కార్యాలయంలో సంప్రదిస్తే వెంటనే పరిష్కరిస్తానని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

అబిడ్స్: మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు పేర్కొన్నారు. అబిడ్స్ బొగ్గులకుంటలోని ఫెర్నాండేజ్ ఆస్పత్రిలో సిబ్బంది, విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ.. హెల్మెట్, లైసెన్స్ లేకుండా వాహనాలను నడపడంతో పాటు మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, ర్యాష్ డ్రైవింగ్ వంటివి ప్రమాదాలకు కారణమవుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు అవకాశం ఉండదన్నారు.

వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న శంకర్, రవికుమార్

అబిడ్స్: హాకా నూతన చైర్మన్‌గా నియమితులైన మచ్చ శ్రీనివాస్‌ను రాష్ట్ర అవోపా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర అవోపా అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్, మేడ్చల్ అవోపా అధ్యక్షుడు కట్ట రవికుమార్ ఆయనను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మల్లిపెద్ది శంకర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆర్య వైశ్యులకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల ఫండ్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. మచ్చ శ్రీనివాస్‌ను చైర్మన్‌గా నియమించిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాంపల్లి: అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి (40) రైల్వే ప్లాట్‌ఫారంపై పడి మృతిచెందిన ఘటన నాంపల్లి రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 40 సంవత్సరాల వయసు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి లింగంపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం-1పై మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఒంటిపై నలుపు, ఎరుపు, ఆకుపచ్చ రంగుల టీ షర్టు, పసుపు, తెలుపు రంగు కలిగిన డ్రాయర్ ధరించినట్లు పోలీసులు తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే నాంపల్లి జీఆర్పీ పోలీసులను లేదా 9000394635 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఇన్నోవేటివ్ ఐడియాలకు మంచి డిమాండ్

బంజారాహిల్స్: ప్రతి ఇంజినీరింగ్ కాలేజీలో నాలెడ్జ్ సెంటర్ నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ఐటీ కార్యదర్శి జయేష్ రంజన్ పేర్కొన్నారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం.3లోని సుల్తాన్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌యూ నాలెడ్జ్ హబ్ ఫౌండేషన్‌ను ఆయన సొసైటీ చైర్మన్ మహ్మద్ వలియుల్లాతో కలిసి ప్రారంభించారు. జయేష్ రంజన్ మాట్లాడుతూ.. దేశంలో ఇన్నోవేటివ్ ఐడియాలకు మంచి డిమాండ్ ఉందన్నారు. నాలెడ్జ్ సెంటర్లు ఏర్పాటు చేసుకోకపోతే 20 సంవత్సరాలు వెనక్కి వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ప్రస్తుతం విద్యార్థులు ఎంతో ఇన్నోవేటివ్‌గా ఆలోచిస్తున్నారని, వారి ఆలోచనలను షేర్ చేసుకోవడానికి ఇలాంటి నాలెడ్జ్ హబ్‌లు దోహదపడతాయని ఆయన అన్నారు. నూతన స్టార్టప్‌లు ప్రారంభించేందుకు సహకరిస్తామని చెప్పారు. ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావేద్ పాల్గొన్నారు.

సిటీ కళాశాలకు మహర్దశ



ప్రభుత్వ సిటీ కళాశాల భవనం

- కాలేజ్ అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- భవనం మరమ్మతులతో పాటు నూతన గదులు నిర్మించే అవకాశం
- నిధుల కేటాయింపు పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల హర్షం

చార్మినార్: శత వసంతాల ప్రభుత్వ సిటీ కాలేజీకి 2023–24 వార్షిక బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించింది. శిథిలావస్థకు చేరిన భవన మరమ్మతులతో పాటు తరగతి గదుల నిర్మాణం తదితర అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులతో సిటీ కాలేజీలో విద్యా విధానం మరింత పటిష్టంగా మారనుంది. నిధుల కేటాయింపు పట్ల కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు బుధవారం కళాశాల ప్రాంగణంలో సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలభాస్కర్ మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన కాలేజీ శతాబ్ది వేడుకల్లో పాల్గొన్న ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించారన్నారు. నిధుల కేటాయింపునకు ప్రత్యేక చొరవ చూపిన సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రి హరీశ్‌రావుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రత్న ప్రభాకర్, డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు, డాక్టర్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



సంబరాలు నిర్వహించిన అనంతరం మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్

85 వేల మంది విద్యాభ్యాసం..

విద్యా రంగంలో చారిత్రాత్మకమైన ప్రభుత్వ సిటీ కాలేజీకి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇప్పటి వరకు ఇక్కడ 85 వేల మంది విద్యనభ్యసించినట్లు రికార్డులు చెబుతున్నాయి. రాజకీయ ప్రముఖుల్లో శివరాజ్ పాటిల్, ఎస్‌బీ చవాన్, మర్రి చెన్నారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, మధుయాస్కీగౌడ్‌తో పాటు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ జయశంకర్, క్రికెటర్ అర్షద్ అయ్యూబ్, ప్రముఖ తెలుగు సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ, విలన్‌గా ఎన్నో చిత్రాల్లో నటించిన ప్రభాకర్‌రెడ్డి ఈ కళాశాలలో చదువుకున్నారు. వీరితో పాటు ఇక్కడ చదువుకున్న చాలా మంది శాస్త్ర, సాంకేతిక, విద్యా రంగాల్లో స్థిరపడ్డారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పని చేస్తున్న సిటీ కాలేజీ అటానమస్‌గా కొనసాగుతోంది. స్వాతంత్ర్యానికి పూర్వం 1853 నుంచి దారుల్–ఉల్–ఉలూం పేరుతో ఇక్కడ విద్యాభ్యాసం కొనసాగింది. అప్పటి నిజాం వద్ద మంత్రిగా పని చేసిన సాలార్‌జంగ్ అప్పట్లో విద్యాభివృద్ధికి నిరంతరం శ్రమించారు. అనంతరం ఇది సిటీ కాలేజీగా మారింది. ఇక్కడ విద్యాభ్యాసం చేసిన రాంలాల్ అనే విద్యార్థి ఇదే కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పని చేశారు. 1949 నుంచి 1955 వరకు ఆయన ప్రిన్సిపాల్‌గా పని చేశారు.

పదోన్నతి కల్పించాలని ఉపాధ్యాయుల నిరసన



నల్లబ్యాడ్జీ ధరించి నిరసన తెలుపుతున్న అఫ్జల్‌గంజ్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

అఫ్జల్‌గంజ్: తెలంగాణ రాష్ట్ర పండిత ఐక్య వేదిక పిలుపు మేరకు అఫ్జల్‌గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. బుధవారం పాఠశాలలో తెలంగాణ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర కార్యదర్శి, అఫ్జల్‌గంజ్ ఉన్నత పాఠశాల తెలుగు పండితుడు డాక్టర్ ఎస్ విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో తెలుగు, హిందీ పండితులు, పీఈటీలు నిరసన వ్యక్తం చేశారు. 27 ఏళ్లుగా పండితులకు పదోన్నతులు లేకపోవడంతో శ్రమ దోపిడీకి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా గతంలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు పండితుల పదోన్నతులకు ఉన్న అడ్డంకులు తొలగించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

షాదీముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాషా ఖాద్రీ

యాకుత్‌పురా: ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సూచించారు. చార్మినార్ మండల పరిధిలో లబ్ధిదారులకు మంజూరైన షాదీముబారక్ చెక్కులను బుధవారం డబీర్‌పురాలోని మండల కార్యాలయంలో కార్పొరేటర్లు, తహసీల్దార్‌తో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అర్హులందరికీ ఆసరా, షాదీముబారక్, కల్యాణలక్ష్మి, దళితబంధు అందజేస్తున్నామన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో రెయిన్‌బజార్, తలాబ్ చంచలం, మొఘల్‌పురా కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, డాక్టర్ సమీనా బేగం, నస్రీన్ సుల్తానా, తహసీల్దార్ ఎస్పీఆర్ మల్లేష్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఆసీఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'కొండ కోనమ్మ' పాట ఆవిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో హార్ట్‌ఫుల్ చానెల్ చిత్రీకరించిన కొండ కోనమ్మ వీడియో సాంగ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉండే సహజ సౌందర్యాన్ని చక్కగా ఆవిష్కరించారని కొనియాడారు. గణతంత్ర దినోత్సవ పరేడ్, ప్రధానమంత్రి నివాసంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన ఇందిరా ప్రియదర్శిని కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ ఎం.భవానిని ఆయన సన్మానించారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలచారి, డైరెక్టర్ శ్రీను, హరిప్రియ, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



పాటను ఆవిష్కరిస్తున్న జూలూరు గౌరీశంకర్ తదితరులు

షేక్‌పేట్‌లో వేగంగా అభివృద్ధి పనులు



మినీ హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన కార్పొరేటర్ ఫరాజ్

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యుడు, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన మినీ బృందావన్ కాలనీ, కోహిస్సార్ కాలనీల్లో మోడ్రన్ లైట్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలతో పాటు షేక్‌పేట్ డివిజన్‌లోని పాత బస్తీలలో సైతం కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేయించానన్నారు. డివిజన్ పరిధిలో ఎక్కడా డ్రైనేజీలు పొంగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గత వారం తాను వీధి లైట్ల విభాగం అధికారులతో సమావేశమై డివిజన్‌లో వెలగని వీధి దీపాల విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే మరమ్మతులు చేశారన్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు ఎండీ సుల్తాన్ తదితరులు ఉన్నారు.

నేడు చేపట్టాల్సిన డీఏఓల ధర్నా కార్యక్రమం వాయిదా

నాంపల్లి: సర్వీస్ రూల్స్, శాఖా పరమైన సమస్యల పరిష్కారానికి ఐఏఎస్ అధికారి ఆధ్వర్యంలో ఆఫీసర్స్ కమిటీ వేసేందుకు ఆర్థిక శాఖ అధికారులు అంగీకరించారని డీఏఓల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మహమ్మద్ మొహియుద్దీన్, రాధా రమణారెడ్డి, కోశాధికారి హాషం పేర్కొన్నారు. ఆర్థిక శాఖ అడ్మిన్–2 డైరెక్టర్ పరిధిలోని అన్ని పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు అంగీకరించడంతో ఈ నెల 9న డీఏఓలు చేయాలనుకున్న నల్ల బ్యాడ్జీల నిరసన, ధర్నా కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. బుధవారం నాంపల్లిలోని ఆర్థిక శాఖ అడ్మిన్–2 డైరెక్టర్‌తో డీఏఓలు సమావేశమయ్యారు. ప్రభుత్వంతో సంప్రదించిన తర్వాత ఆర్థిక శాఖ మరో సమావేశం నిర్వహించి అన్నింటికి పరిష్కారం చూపిస్తామని డైరెక్టర్ హామీ ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని సంఘం నేతలు తెలిపారు. అధికారులు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారని, పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తారని తాము భావిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఏపీఏఓ, పీఏఓ అధికారుల సంఘాల ప్రతినిధులు రాంగోపాల్, దేవ్‌సింగ్ పాల్గొన్నారు.

సత్కారం



చార్మినార్: హజ్రత్ అలీ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని విద్యా రంగంలో విశేష సేవలు అందిస్తున్న హైదరీ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధి, బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీని ముస్లిం మత పెద్దలు సత్కరించారు. ఇమామియా ఎడ్యుకేషనల్ ట్రస్ట్, అర్ష్–ఈ–రిసాలత్ కమిటీ సంయుక్తాధ్వర్యంలో పురానీహవేలీలో జరిగిన జయంతి వేడుకల్లో మౌలానా సయ్యద్ జాఫర్ హైదర్ రజ్వీ, మౌలానా సయ్యద్ మహసిన్ కమల్ రజ్వీ, మీర్ అశ్వాక్ అలీ ఖాన్ తదితరులు మీర్ ఫిరాసత్ అలీని సత్కరించి మొమెంటో అందజేశారు.

'రాష్ట్ర బడ్జెట్ బాగుంది'



కార్యక్రమంలో మాట్లాడుతున్న వహీద్ అహ్మద్

గోల్కొండ: మంత్రి హరీశ్‌రావు ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ చాలా బాగుందని అడ్వకేట్స్ ఫోరం ఫర్ జస్టిస్ రాష్ట్ర చైర్మన్, వక్ఫ్ బోర్డు మాజీ సభ్యుడు వహీద్ అన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా కేటాయింపులు చేసిన నేపథ్యంలో బుధవారం ఆయన ఆధ్వర్యంలో టోలిచౌకిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పుడూ న్యాయవాదులకు అండగా ఉంటారన్నారు. న్యాయవాదుల సమస్యలు సీఎం కేసీఆర్‌కు తెలుసని, అందువల్లే న్యాయవాదుల కోసం బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేశారన్నారు. కార్యక్రమంలో ఎం.ఏ.ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కాడెద్దులు పంపిణీ



రైతులకు ఎద్దులను పంపిణీ చేస్తున్న జీవన్‌రెడ్డి, ప్రభుదత్త మహారాజ్

జియాగూడ: పేద రైతులను గుర్తించి వారు సేద్యం చేసుకునేందుకు ఉచితంగా కాడెద్దులు అందజేయడం అభినందనీయమని టీటీడీ బోర్డు మెంబర్ జీవన్‌రెడ్డి, మాజీ బోర్డు మెంబర్ శివకుమార్ అన్నారు. బుధవారం జియాగూడ సమర్థ కామధేను గోశాలకు చెందిన సుమారు 8 జతలను ఆశ్రమ పీఠాధిపతి ప్రభుదత్త మహారాజ్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రైతులకు అందజేశారు. కార్యక్రమంలో గోశాల సేవకుడు ఆధిత్య తదితరులు పాల్గొన్నారు.

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సుల్తాన్‌బజార్: యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని, రెండవ విడత గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా బ్యాంక్ అకౌంట్లో నగదు జమ చేయాలని సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారమోని శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. దీంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు కుమార్‌చౌదరి వారిని పరామర్శించారు.

కేవీ రమణాచారి జన్మదిన వేడుకలు



రమణాచారి దంపతులను సన్మానిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి ఎక్కడ విధులు నిర్వహించినా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం సారిపల్లి కొండల్‌రావు ఫౌండేషన్, యువ కళావాహిని సంయుక్త ఆధ్వర్యంలో రమణాచారి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఒక ఉద్యోగి ఆ స్థానం నుంచి బదిలీ అయినా, పదవీ విరమణ పొందినా ఆ ఉద్యోగి గురించి సమాజం మరిచిపోతుందని, అయితే రమణాచారి పదవీ విరమణ పొంది సంవత్సరాలు గడుస్తున్నా కళాకారులు, ఉద్యోగులకు ఆయన మీద గౌరవం తగ్గలేదన్నారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను సన్మానించి ప్రోత్సాహక నగదు అందజేశారు. కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి, పారిశ్రామిక వేత్త సారిపల్లి కొండల్‌రావు, సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్, కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎస్.లింగయ్య, యువ కళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్‌కు ప్రజల మద్దతు పెరుగుతోంది

ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్



పార్టీ నాయకులు, కార్పొరేటర్లతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ ప్రజల పార్టీ అని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన టోలిచౌకిలోని తన కార్యాలయంలో మజ్లిస్ కార్పొరేటర్, నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. తమ పార్టీకి రోజురోజుకు ప్రజల నుంచి మద్దతు పెరుగుతుందన్నారు. సెక్యులర్ సిద్ధాంతాల్ని పక్కాగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని, అందువల్లే తమ పార్టీ తెలంగాణ నుంచి మరిన్ని సీట్లకు పోటీ చేయాలని నిర్ణయించిందన్నారు. నిత్యం ప్రజలతో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. మజ్లిస్ పార్టీ నిబద్ధతకు కార్వాన్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులే నిదర్శమని ఆయన అన్నారు. ఇక్కడ జరుగుతున్న డ్రైనేజీ పనులు పూర్తి కాగానే రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. పనులను స్థానికులు పరిశీలిస్తూ ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు.

చేతి వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటాచారి

సుల్తాన్‌బజార్: ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల వల్ల చేతి వృత్తులు కోల్పోయిన విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కులస్థులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. చేతివృత్తి పనులు మరుగున పడడంతో విశ్వకర్మలకు చేతినిండా పని లేదని, దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయడంతో పాటు ప్రత్యేకంగా రూ.500 కోట్లు కేటాయించి వారి సంక్షేమానికి ఖర్చు చేయాలని విజ్ఞప్తి చేశారు. కుల వృత్తిదారులకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని కోరారు. విశ్వబ్రాహ్మణుల ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం ఉప్పల్ భగాయత్‌లో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించగా ఇటీవల భూమి పూజ చేసినట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు రవీంద్రాచారి, శశిధర్ శిల్పి, వీరాచారి, శ్రీనివాసచార్యులు, కిషన్, వెంకటస్వామి, సుదర్శనాచారి, వీణవంక సదానందం తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముజీబ్ హుస్సేనీ, విక్రమ్‌కుమార్

అబిడ్స్: టీఎన్జీఓస్ యూనియన్ ఉద్యోగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ జిల్లా పరిధిలోని యూనిట్ అధ్యక్షులు, కార్యదర్శులు సమావేశమై ఈ నెల 17న ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే మెగా రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించి 1000 మంది ఉద్యోగులు రక్తదానం చేసేలా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి విక్రమ్‌కుమార్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు



బంజార దర్వాజ-గోల్కొండ రోడ్డు పక్కన ఉన్న పైపులు

గోల్కొండ: రోడ్లను అద్దంలా తయారు చేస్తామని ప్రభుత్వ అధికారులు చేస్తున్న ప్రకటనలు ఆచరణలో కనిపించడం లేదు. అభివృద్ధి పనుల పేరుతో కాంట్రాక్టర్లు రోడ్లను ఇష్టానుసారంగా తవ్వేస్తూ నెలల తరబడి అలాగే వదిలేస్తున్నారు. కార్వాన్ నియోజకవర్గంలోని నానల్‌నగర్, గోల్కొండ, టోలిచౌకి, లంగర్‌హౌస్ డివిజన్‌లలో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. ఇందులో వరద నీటి పైప్‌లైన్ పనులు సైతం ఉన్నాయి. అయితే పనులు ప్రారంభం కాకముందే అధికారుల ఆదేశాలతో గుత్తేదార్లు భారీ పైపులను రోడ్డు పక్కన వేశారు. పైపులు వేసేందుకు తవ్వకాలు సైతం చేశారు. గోల్కొండ, బంజార దర్వాజ నుంచి కఠోర హౌస్ మీదుగా గోల్కొండ కోటకు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన భారీ పైపులు పడివున్నాయి. అత్యంత రద్దీగా ఉండే ఈ మార్గంలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. టోలిచౌకి చౌరస్తా నుంచి టూంబ్స్ రోడ్డు వెళ్లే మార్గంలో సైతం జరుగుతున్న డ్రైనేజీ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయి. కంపెనీ బాగ్, మహ్మదీ లైన్ చౌరస్తా తదితర ప్రాంతాలలో నిత్యం తవ్వకాలు జరుగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదార్లు తమ ఇష్టం వచ్చినట్లు పనులు చేస్తున్నారు. పనులను త్వరగా పూర్తి చేసి తవ్విన రోడ్లను పూడ్చాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

మంత్రి సబితారెడ్డికి వినతి



మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మాలమహానాడు నాయకులు

లిబర్టీ: ఎస్సీ ఉపాధ్యాయులకు ప్రమోషన్లలో అన్యాయం జరగకుండా చూడాలని విద్యా శాఖ మంత్రికి మాల మహానాడు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ సారథ్యంలోని ప్రతినిధి బృందం మంత్రి పి.సబితాఇంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. జీవో ఎంఎస్ నెంబర్ 5, జీవో ఎంఎస్ నెంబర్ 21 ప్రకారం ఎస్సీ ఉపాధ్యాయులకు ప్రమోషన్లలో న్యాయం జరగకుండా చూడాలని విన్నవించారు. ఎస్సీ, ఎస్టీ, ఉపాధ్యాయులు ఓపెన్ కేటగిరీలో ఎంపికైనప్పటికీ వారికి ప్రమోషన్లు ఇచ్చే సమయంలో రిజర్వేషన్ వర్తింపజేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని ఈ సందర్భంగా మంత్రిని కోరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు శ్రీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.